ఎస్‌ఎన్‌డీపీ పనులను పూర్తి చేయండి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): సూర్యానగర్‌కాలనీ, ఉదయ్‌నగర్ కాలనీలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. సూర్యానగర్‌కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఎస్‌ఎన్‌డీపీ(స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్) పనులను పూర్తి చేయించాలని, నాలా పక్కన పార్కు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పార్కుతో పాటు రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈ కృష్ణారావు, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, బీఆర్ఎస్ చంపాపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



శంకేశ్వర్ బజార్ బస్తీలో రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

శంకేశ్వర్ బజార్ బస్తీలో

వరద ముంపు లేకుండా చర్యలు : ఎమ్మెల్యే బలాల

సైదాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): శంకేశ్వర్ బజార్ బస్తీలో వరద ముంపు లేకుండా చర్యలు చేపడతామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. బస్తీ సమీపంలో నాలాలో చెత్తచెదారం పేరుకుపోవడంతో వరదనీరు ఇళ్లలో చేరడంతో స్థానికులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి ఆ ప్రాంతాన్ని శుక్రవారం సందర్శించారు. పాతబస్తీ, సంతోష్‌నగర్, చంపాపేట మీదుగా వచ్చే వరద నీరు నాలాలో చేరడంతో ముంపు సమస్య ఏర్పడుతోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. నాలాలో చెత్తాచెదారాన్ని తొలగించాలని అధికారులను కోరారు.



అష్టలక్ష్మీ దేవాలయంలో
ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా తదితరులు

అష్టలక్ష్మీ ఆలయంలో మొక్కు తీర్చుకున్న సబితారెడ్డి

ఎల్‌బీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం ఆర్‌కేపురం వాసవీకాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయంలో మొక్కు తీర్చుకున్నారు. 21 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలోగల అన్నప్రసాద శాలను, నిత్యాన్నదాన సత్రంను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానందగుప్తా, ఆలయ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, మహిళా అధ్యక్షురాలు ఉర్మిళరెడ్డి, నియోజకవర్గం మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ ఐలయ్య

కమ్మగూడలో ట్రంకు లైన్, బీటీ రోడ్డు పనులకు మోక్షం

హయత్‌నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 22వ వార్డులో రూ. 50 లక్షలతో చేపడుతున్న బీటి రోడ్డు, ట్రంకు లైన్ నిర్మాణం పనులను కౌన్సిలర్, మున్సిపాలిటీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశిక ఐలయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రంకు లైన్ కోసం రూ. 20 లక్షలు మంజూరయ్యాయని, సాగర్ హైవే కేబీ పర్నిచర్ నుంచి నవభారత్ కాలనీ, రాజ్‌రంజిత్ కాలనీ వరకు ఉన్న మట్టి రోడ్డును రూ. 30 లక్షలతో బీటీ రోడ్డుగా మారుస్తున్నారని తెలిపారు.



సైదాబాద్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మంజులా రెడ్డి తదితరులు

ఎంఐఎం నేతపై మహిళా మోర్చా ఫిర్యాదు

సైదాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవీలతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యాకుత్‌పురా నియోజకవర్గం ఎంఐఎం ఇన్‌చార్జి యాసిర్ అరాఫత్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ భాగ్యనగర్ జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డి ఆధ్వర్యంలో సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దొంగ ఓట్లను వేసే వారిని గుర్తించే క్రమంలో హిజాబ్ తొలగించమని మాధవీలత కోరడం తప్పేమిటని ప్రశ్నించారు. పాస్‌పోర్టు ఆఫీస్‌లో, విమానాశ్రయాల్లో లేని నిబంధన పోలింగ్‌లో ఉండటమేంటని అన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నేతలు దశరథ లక్ష్మి, రేణుకా ముదిరాజ్, తులసి, వసంత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

వనస్థలిపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. విజయపురి కాలనీ ఫేజ్-1లోని షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన 22వ వార్షిక ఆరాధన ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దైవారాధనకు కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పర్వత్‌రెడ్డి, కార్యదర్శి విష్ణువర్ధన్‌రావు, సాయిరాం, కనకరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ వార్షిక ఆరాధన ఉత్సవాల్లో కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

కంకర పరిచి పది నెలలు..

● ముందుకు కదలని రోడ్డు పనులు ● ధ్వంసమైన మ్యాన్‌హోల్స్.. పట్టించుకోని అధికారులు
● ఇదీ గుర్రంగూడ ఆదిత్యనగర్ రోడ్డు దుస్థితి



కంకరతో ఆదిత్యనగర్ రోడ్డు

సరూర్‌నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో.. శిలాఫలకం వేసి పనులు మొదలుపెట్టి పది నెలలవుతున్నా రోడ్డు పనులు ముందుకు సాగడంలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్ కేవలం కంకర పరిచి చేతులు దులుపుకోగా, దానిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసే పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. బడంగ్‌పేట్ కార్పొరేషన్ గుర్రంగూడ 7వ డివిజన్ పరిధిలో ఆదిత్యనగర్ రోడ్డు దుస్థితి ఇది!

పాదచారులకు తగులుతున్న కంకర రాళ్లు

సీసీ రోడ్డు పనులను గాలికొదిలేయడంతో.. రోడ్డుపై పరిచిన కంకర రాళ్లు వాహనాల తాకిడికి పైకి లేచి పాదచారులకు, రోడ్డు పక్కన నివాసగృహాల్లో ఉండే వారికి తగులుతున్నాయి. దాంతో వారు తరచుగా గాయాలబారిన పడుతున్నారు. వాహనాల రాకపోకల వల్ల దుమ్ము రేగుతోంది. అదంతా ఇళ్లలోకి చేరి ఆహార పదార్థాలపై పడుతోందని స్థానికులు వాపోతున్నారు.

రూ.కోటిన్నర పనుల్లో చేసింది కొసరంతే..

ఆదిత్యనగర్ రోడ్డును కొంతమేర బీటీ రోడ్డుగా, మిగతాది సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి హెచ్‌ఎండీఏ నుంచి రూ.1.50 కోట్లు కేటాయించారు. సదరు నిధులతో చేపట్టనున్న రోడ్డు పనులకు గతేడాది జూలై 15వ తేదీన మేయర్ పారిజాతానర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ శేఖర్, స్థానిక కార్పొరేటర్ లక్ష్మారెడ్డి తదితరులతో కలిసి అప్పటి మంత్రి పి.సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి పూర్తి చేయాల్సిన అధికారులు, కాంట్రాక్టర్లు ఆ దిశగా ఎలాంటి ప్రయత్నమూ చేసిన దాఖలాలు కనిపించడంలేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాజకీయ నేతల ఒత్తిడితో హడావిడిగా కొంత మేర బీటీ రోడ్డు వేసి, సీసీ రోడ్డు వేయాల్సిన భాగంలో రోడ్డును తవ్వి కంకర పరిచారు. ఆ తర్వాత కన్నెత్తి చూసే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఐదు నెలలు గడిచినా నేటికీ రోడ్డు పనుల గురించి అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రోడ్డు పనులను ప్రారంభించాలని కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ధ్వంసమైన మ్యాన్‌హోల్

రక్తపోటును నియంత్రించండి.. ఎక్కువ కాలం జీవించండి

● హృద్రోగ వైద్యులు రాజీవ్‌గార్గ్, ముఖేష్‌రావు

ఎల్‌బీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): రక్తపోటును నియంత్రించండి.. ఎక్కువ కాలం జీవించండని గ్లెనిగల్స్ అవేర్ ఆస్పత్రి హృద్రోగ వైద్యులు డాక్టర్ రాజీవ్‌గార్గ్, డాక్టర్ ముఖేష్‌రావు సూచించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా కర్మన్‌ఘాట్‌లోని గ్లెనిగల్స్ అవేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 5కే వాకథాన్‌ను ఆస్పత్రి సీఓఓ డాక్టర్ కరుణాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తపోటు వల్ల కలిగే సమస్యలు, నివారణ, చికిత్స గురించి ప్రజలకు తెలియజేయడానికి ప్రతి సంవత్సరం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. 2005లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. రక్తపోటు నివారణకు జీవన శైలి మార్చుకోవాలని, తక్కువ ఉప్పు, తక్కువ కార్బోహైడ్రేట్లు, మాంసకృతులు, నూనె పదార్థాలను తక్కువగా తీసుకోవాలన్నారు. రక్తపోటు వల్ల కిడ్నీలు, గుండె వైఫల్యం, పక్షవాతం, దృష్టి కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. క్రమంగా పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహాలు పాటించాలన్నారు. వాకథాన్‌లో వైద్యులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లింద్రస్వామితోపాటు వివిధ విభాగాల అధిపతులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



5కే వాకథాన్‌లో పాల్గొన్న గ్లెనిగల్స్ అవేర్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

మారుతీ సుజుకీ కొత్త స్విఫ్ట్ కారు ఆవిష్కరణ

ఎల్‌బీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): మారుతీ సుజుకీ ది ఎపిక్ న్యూ స్విఫ్ట్ కారును ఆవిష్కరించారు. కర్మన్‌ఘాట్ ఆదర్శ మోటార్స్ మారుతీ సుజుకీ షోరూంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కారును శుక్రవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. కంపెనీ వర్గాలు మాట్లాడుతూ.. లీటరు పెట్రోల్‌తో 25 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుందని చెప్పారు. ఆరు ఎయిర్‌బ్యాగ్స్ అందిస్తున్నామని, కారులో అడ్వాన్స్ ఫీచర్స్ ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎండీ విజయ్‌గౌడ్, ఆదర్శ మోటార్స్ సీఈఓ నళినీకాంత్, జీఎం కార్తీక్‌రెడ్డి, మారుతీ ఎఫ్‌ఎస్‌డీఎం శ్రీనాథ్‌రెడ్డి, సేల్స్ మేనేజర్ వీఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతితో..

అల్కాపురిలో విషాదఛాయలు

ఎల్‌బీనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అబ్బరాజు పృథ్వీరాజ్ మృతితో అల్కాపురిలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంగారెడ్డి జహీరాబాద్‌కు చెందిన అబ్బరాజు వెంకటరమణ విద్యుత్‌శాఖలో పనిచేసి రిటైరయ్యారు. నగరంలో అల్కాపురి యాదవనగర్ రోడ్డు నంబర్ 4లో స్థిరపడ్డారు. 2021లో క్రితం వెంకటరమణ అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రస్తుతం ఇంటికి పెద్దవాడైన పృథ్వీరాజ్ కూడా మరణించడంతో తల్లి మధుర, చెల్లెలు ప్రత్యూష శోకసంద్రంలో మునిగిపోయారు. గురునానక్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసిన పృథ్వీరాజ్ ఎనిమిదేళ్ల క్రితం అమెరికా నార్త్ కరోలినాలో మైక్రోసాఫ్ట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేరాడు. రెండేళ్ల క్రితం శ్రీప్రియతో అతడికి వివాహం అయింది. త్వరలో చెల్లెలి వివాహం చేసి, రెండేళ్లలో స్వదేశానికి తిరిగి వచ్చేయాలనుకున్నాడు. ఈ నెల 15న భార్య శ్రీప్రియ, మరో ముగ్గురు స్నేహితులతో కలిసి కరోలినా నుంచి నార్త్ చార్లెట్‌కు ఓ శుభకార్యానికి వెళ్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న కారు మరో కారును ఢీకొనడంతో ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో సురక్షితంగా బయటపడ్డారు. ఆందోళన చెందిన వారు రోడ్డు పక్కన నిలబడి ప్రమాద విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వాలనుకున్నారు. వారందరి ఫోన్లు కారులోనే ఉండటంతో ఫోన్ తీసుకొచ్చేందుకు పృథ్వీరాజ్ కారు వద్దకు వెళ్లాడు. ఫోన్ తీసుకుని వస్తుండగా వేగంగా వచ్చిన మరో కారు అతడిని ఢీకొట్టడంతో మృతి చెందాడు. ముందు ప్రమాదం జరిగిందని సమాచారం వచ్చిందని, తర్వాత పృథ్వీరాజ్ చనిపోయాడని తెలిసిందని బంధువు విశ్వనాథ్ కులకర్ణి తెలిపారు. న్యూయార్క్ నుంచి మృతదేహాన్ని శనివారం నగరానికి తరలించేందుకు చర్యలు చేపట్టినట్లు అక్కడి అధికారులు తెలిపారని ఆయన చెప్పారు.



పృథ్వీరాజ్ తల్లి, చెల్లిని ఓదారుస్తున్న బంధువులు



పృథ్వీరాజ్(ఫైల్)

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే..

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

బర్కత్‌పుర, మే 17 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోకు కట్టుబడి ఉండాలని కోరారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు జరిపితే అడ్డుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ ఆధ్వర్యంలో 13 బీసీ సంఘాలు, 30 బీసీ కుల సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించిందని, దానికి కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. కులాల వారీగా లెక్కలు సేకరించిన తర్వాత విద్య, ఉద్యోగ రంగాలలో బీసీ రిజర్వేషన్లను 50 శాతం పెంచాలని, క్రీమీలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు దానకర్ణచారి, నీల వెంకటేష్, కోల జనార్దన్, నందగోపాల్, రామకృష్ణ, ఆశీష్‌గౌడ్, అభినవ్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, ప్రణీతరాణి, శివమ్మ, రఘుపతి, వినోద్, వేణుగోపాల్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఆర్. కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, లాల్‌కృష్ణ తదితరులు

ఆదివాసీ ఉద్యోగులకు

కనీస వేతనం రూ. 35 వేలు ఇవ్వాలి

బర్కత్‌పుర, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ఉద్యోగులకు కనీస వేతనం 35 వేలు ఇవ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మరకాల ప్రసన్నకుమారి, కోశాధికారి కందుల ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పీఆర్‌సీ కమిషనర్ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలో పనిచేస్తున్న ఆదివాసీ గిరిజన ఉద్యోగులకు అలవెన్స్, గ్రామీణ ప్రాంత ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ 20 శాతానికి, వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు, మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ లీవ్‌లను 90 నుంచి 180 రోజులకు, పురుష ఉద్యోగులకు కూడా చైల్డ్‌కేర్ లీవ్‌లను 60 రోజులకు పెంచాలని కోరారు. ఉద్యోగ విరమణ తర్వాత ఎరియర్స్‌ను వెంటనే ఇవ్వాలని, గ్రాట్యుటీ రూ. 30 లక్షలకు పెంచాలన్నారు.



పీఆర్‌సీ కమిషనర్ శివశంకర్‌కు
వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ ఉద్యోగుల సంఘం నేతలు

ఇద్దరు మహిళల కొట్లాట..

● వృద్ధురాలి అనుమానాస్పద మృతి
● పోలీసుల దర్యాప్తుపై బాధితుల అనుమానం
● డీసీపీకి ఫిర్యాదు.. సమగ్ర విచారణకు ఆదేశం

సైదాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇద్దరి మధ్య జరిగిన గొడవలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. గొడవ కారణంగానే చనిపోయిందని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా.. ఆమె మరణానికి అనారోగ్యమే కారణమని పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పంచాయితీ డీసీపీ వద్దకు చేరింది. ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఏసీపీని ఆదేశించారు. పోలీసులు, మృతురాలి కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. సింగరేణి కాలనీలో శకుంతల బాయి(60), ఆమె ఇంటిఎదుట కిరాణా దుకాణం నిర్వహించే సువర్ణ గత నెల 25వ తేదీ రాత్రి కొట్టుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన శకుంతల అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఈ నెల ఒకటో తేదీన మృతి చెందింది. గొడవ జరిగిన మరుసటి రోజు శకుంతలను దవాఖానాలో చేర్పించి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని, ఆ తరువాత తమ ఫిర్యాదుతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారని వెల్లడించారు. గొడవ కారణంగానే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా, పోస్టుమార్టం నివేదిక తరువాతే దర్యాప్తు చేస్తామంటూ పోలీసులు చెబుతున్నారు. సైదాబాద్ పోలీసుల వ్యవహారం అనుమానంగా ఉందంటూ బాధిత కుటుంబ సభ్యులు డీసీపీ జానకీ దరావత్‌ను కలిశారు. ఈ కేసుపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని సైదాబాద్ ఏసీపీ వెంకన్ననాయక్‌ను ఆదేశించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత, గొడవ కారణంగా దెబ్బలు తగిలి మృతి చెందిందా? ఆ గొడవతో మనస్తాపానికి గురైందా? అనే అంశాలను పరిగణనలోకి తీసుకొని తదుపరి విచారణ చేస్తామని బాధితులకు డీసీపీ భరోసా ఇచ్చారు. పోలీసులపై ఆరోపణలు అవాస్తవాలని, బాధితుల ఫిర్యాదు తీసుకోవడంలో ఎలాంటి జాప్యం లేదని, బాధితులు తనను కలిశారని, వారు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకున్నామన్నారు.

రోడ్డుపై మురుగు నీరు



సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి
దిల్‌సుఖ్‌నగర్‌లో రోడ్డుపై మురుగునీరు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో ఫీడర్ల మరమ్మతు కారణంగా శనివారం దోబీఘాట్ ఫీడర్ పరిధిలో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, గంజ్ ఫీడర్ పరిధిలో ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు, ఆనంద్‌నగర్, శివగంగా, గౌతంనగర్, సరస్వతి నగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు, చంద్రయ్య హట్స్, జీఏ కాలనీ, అక్బర్ బాగ్ ఫీడర్ల పరిధిలో ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని డీఈ హన్మంతరెడ్డి తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

చాదర్‌ఘాట్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రేష్ఠ శ్రీకమల ఆస్పత్రిలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, డెంటల్, ఫైబ్రో స్కాన్, ఎముకల సాంద్రత పరీక్షలతోపాటు ఈసీజీ, జీఆర్‌బీఎస్, సీబీపీ పరీక్షలను ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు చేస్తారు. వివరాలకు 8908901188, 040-27766 1188 ఫోన్ నంబర్‌లలో సంప్రదించవచ్చు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

మదీన, మే 17 (ఆంధ్రజ్యోతి): బైక్‌లు చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఎనిమిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పురాకు చెందిన అబ్దుల్ ఖదీర్, బండ్లగూడ నూరినగర్‌కు చెందిన అమానుల్లా స్నేహితులు. జల్సాలకు అలవాటుపడిన వీరు సులువుగా డబ్బు సంపాదన కోసం బైక్ దొంగతనాలు చేస్తున్నారు. కొంతకాలంగా ఎనిమిది బైక్‌లను దొంగిలించారు. బైక్‌లు చోరీ అవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో ఈనెల 16వ తేదీన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. విచారించగా.. బండ్లగూడ, అఫ్జల్‌గంజ్, షాలిబండ, పంజాగుట్ట, చాంద్రాయణగుట్ట, హుసేనిఆలం పోలీస్‌స్టేషన్ల పరిధిలో బైక్‌లను దొంగిలించినట్లు అంగీకరించారు. వారి నుంచి రూ. 8.60 లక్షల విలువైన ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

స్నేహితులతో సెల్ఫీ తీసుకుంటూ..

● భవనంపై నుంచి కిందపడిన బాలుడు

చాంద్రాయణగుట్ట, మే 17 (ఆంధ్రజ్యోతి): భవనంపై స్నేహితులతో కలిసి సెల్ఫీ దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడిన ఓ బాలుడు గాయపడ్డాడు. ఈ ఘటన ఉప్పుగూడ క్రాంతినగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కందికల్‌గేట్ ప్రాంతానికి చెందిన భాగ్య కుమారుడు నాని(16) శుక్రవారం ఉప్పుగూడ క్రాంతినగర్‌లో వాంబే క్వార్టర్స్‌కి వెళ్లాడు. అతడి స్నేహితులు క్వార్టర్స్ రెండో అంతస్తులో ఉంటున్నారు. నాని వారితో కలిసి సెల్‌ఫోన్‌లో ఫొటోలు, సెల్ఫీ దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.